సాక్షి
శ్రీకాకుళం
గురువారం । 20 । జూన్ । 2024



ముప్పై ఏళ్లకు..
ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తి పెరుగుతోంది. ఇది ముప్పై ఏళ్ల ఫలసాయాన్నిస్తుంది.
- 8లో



ఈదురుగాలుల బీభత్సం
ఇచ్ఛాపురంలో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. చెట్లు నేలకొరిగాయి.
- 8లో



దారి కాచిన మృత్యువు
టెక్కలిలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఇద్దరు దుర్మరణం పాలయ్యారు.
- 8లో

న్యూస్‌రీల్

నీలమణి దుర్గ హుండీ ఆదాయం రూ.6.37లక్షలు



నీలమణి దుర్గ ఆలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

పాతపట్నం: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం నీలమణి దుర్గ అమ్మవారి హుండీ కానుకల ద్వారా రూ.6,37,167 ఆదాయం లభించిందని ఆలయ ఈఓ టి.వాసుదేవరావు తెలిపారు. 43 రోజులకు ఈ ఆదాయం వచ్చిందన్నారు. ఆలయ హుండీని బుధవారం లెక్కించామని, శ్రీకాకుళం సీనియర్ ఆడిట్ అధికారి జీవీబీఎస్ రవి కుమార్ పర్యవేక్షించారన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సింహాచలం, సుదర్శన్, భక్తులు పాల్గొన్నారు.

'పరిస్థితులను అనుకూలంగా మార్చాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: కక్షిదారుల మధ్య ప్రతికూల పరిస్థితులను అనుకూలంగా మార్చగలిగే శక్తి ఒక్క మధ్యవర్తికే సాధ్యమవుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. సుప్రీం కోర్టు మధ్యవర్తిత్వం, సంధి ప్రాజెక్ట్ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న న్యాయవాదుల శిక్షణ కార్యక్రమంలో రెండో రోజు బుధవారం ఆయన మాట్లాడారు. మొదట కక్షిదారులు చెప్పేదంతా వినాలని, అప్పుడే వారికి నమ్మకం కలుగుతుందన్నారు. రెండు వర్గాల నుంచి సమస్యను పూర్తిగా వినడం వల్ల మంచి సమాచారం అందుతుందని వివరించారు. కార్యక్రమంలో పవర్ పాయింట్‌ని ఉపయోగించి తరగతులను మాస్టర్ ట్రైనీలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సివిల్ జడ్జి సీనియర్ డివిజన్ ఆర్.సన్యాసినాయుడు, ట్రైనర్లు జి.శశీదేవి, సుదర్శన సుందర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఎస్‌ఐలు



ఎస్పీ జీఆర్ రాధికను కలిసిన ఎస్‌ఐలు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాలో ఆరుగురు ఏఎస్‌ఐలు ఎస్‌ఐలుగా పదోన్నతి పొందారు. వారిలో జిల్లాకు కేటాయించిన ముగ్గురు ఎస్పీ జీఆర్ రాధికను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసారు. పి.ఢిల్లీరావు, పీవీ రమణ, కె.శివాజీలు బుధవారం ఎస్పీ కార్యాలయంలో కలవగా వారందరికీ ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా ఇటీవల నియమితులైన ఎం.వినీషా కూడా ఎస్పీని కలిసి సెబ్ పరిస్థితులపై మాట్లాడారు.

'వ్యవసాయ గణన పూర్తి చేయాలి'

నరసన్నపేట: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ గణన రెండో విడతను వీఆర్‌ఓలు బాధ్యతగా పూర్తి చేయాలని జిల్లా స్టాటస్టికల్ ఆఫీసర్ సుజాత అన్నారు. వ్యవసాయ గణనపై మండలంలో వీఆర్వోలకు ఒక రోజు శిక్షణ బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ఐదేళ్ల కొకసారి వ్యవసాయ గణన కేంద్రం నిర్వహిస్తుందని, ఇందులో భాగంగా మొదటి విడత పూర్తయ్యిందని, రెండో విడత జూలై కల్లా పూర్తి కావాల్సి ఉందని అన్నారు. రెండో విడతలో మండలంలో 9 రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ గ్రామాల్లో మొత్తం విస్తీర్ణం, ఎలాంటి పొలాలు ఉన్నాయి, రైతులు ఎన్ని పంటలు పండిస్తారు, నీటి సదుపాయం ఉన్న విస్తీర్ణం ఎంత, ఏయే పంటలు పండిస్తున్నారు అనే వివరాలు సేకరించాలని కోరారు.

ఆరుగురిపై క్రిమినల్ కేసులు

ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురం పంచాయతీ నవభారత్‌తో నివాసం ఉంటున్న దాసరి మంగ ఇంటిలో మంగళవారం దూరి దౌర్జన్యంగా ఆటోలో తీసుకు వెళ్లి, చిత్ర హింసలకు గురిచేసిన శ్రీకాకుళం పట్టణం దమ్మలవీధికి చెందిన ఆరుగురు మహిళలపై ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేశారు. హత్యాయత్నం, ఇంటిలో దూరి బలవంతంగా తీసుకువెళ్లటం, హింస, దాడి వంటి సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. మరో పక్క అపస్మారక స్థితికి చేరుకున్న మంగ కోలుకొని తనపై దాడి చేసిన వారిపై బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. రాధ, భవానీ, లక్ష్మి, జయ, నీలిమ, కృష్ణవేణి అనే మహిళలు దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు పోలీసులు ఐదుగురు నిందితులను అరెస్టు చేసి బుధవారం సాయంత్రం కోర్టులో హాజరు పర్చగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారు. మొదటి నిందితురాలు రాధ ప్రస్తుతం అజ్ఞాతంలో ఉండగా, ఆమె కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ఇక్కడి 'కథా'నాయకులమే..



ఆదిత్యుని సన్నిధిలో నాగచైతన్య, సాయిపల్లవి

- ఆదిత్యుని సన్నిధిలో తండేల్ మూవీ హీరోహీరోయిన్లు నాగచైతన్య, సాయిపల్లవి

పాకిస్తాన్ సైన్యానికి చిక్కిన ఈ జిల్లా మత్స్యకారుడి తెగువ, ధైర్యసాహసాలు, స్థానిక జీవన విధానమే తమ 'తండేల్' సినిమా అని, అందుకే తాము ఇక్కడి వాస్తవ కథకు నాయకుల్లా నటిస్తున్నామని ప్రముఖ హీరో, హీరోయిన్లు అక్కినేని నాగ చైతన్య, సాయిపల్లవి అన్నారు. వారు బుధవారం ఉదయం 'తండేల్' దర్శకుడు చందు మొండేటితో కలిసి అరసవల్లి సూర్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ ఎస్.చంద్రశేఖర్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు సాదరంగా ఆహ్వానించి వారికి అంతరాలయంలో ప్రత్యేకంగా గోత్రనామ పూజలు నిర్వహించారు. తొలిసారిగా ఆదిత్యుడిని దర్శించుకున్నామని నాగచైతన్య, సాయిపల్లవి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎచ్చెర్ల మండలం కొత్త దిబ్బలపాలెం మత్స్యకారుడు రామారావు వాస్తవిక కథను.. పాకిస్తాన్‌లో జరిగిన ఘటనల ఆధారంగా ఈ సినిమాను చందూ మొండేటి అద్భుతంగా తెరకెక్కిస్తున్నారని అన్నారు. అరసవల్లి ఆలయంతో పాటు జిల్లా కేంద్రంలో పలు ప్రాంతాలను కూడా పరిశీలిస్తున్నామని దర్శకుడు చందూ మొండేటి అన్నారు. చిత్ర యూనిట్ వస్తున్నారని తెలిసి.. భారీగా స్థానికులు అరసవల్లి ఆలయానికి వచ్చారు. దీంతో ఒకింత తోపులాటలు చోటు చేసుకున్నాయి. వీరి వెంట ట్రస్ట్ బోర్డు సభ్యుడు మండవిల్లి రవి తదితరులున్నారు.



నాగచైతన్య, సాయిపల్లవి, దర్శకుడు చందూలను శేషవస్త్రాలతో సత్కరించిన ఈఓ చంద్రశేఖర్

– అరసవల్లి

డ్రాపౌట్లను బడిలో చేర్చేలా..



శ్రీకాకుళంలోని చేపలవీధిలో నేను బడికి పోతా కార్యక్రమంలో పాల్గొన్న డీఈఓ, సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారులు

- 'నేను బడికి పోతా' పేరిట సరికొత్త కార్యక్రమానికి విద్యాశాఖ శ్రీకారం
- బడిఈడు పిల్లలను వంద శాతం బడుల్లో చేర్పించడమే లక్ష్యం
- గ్రామ, మండల, జిల్లాస్థాయి కమిటీలు
- జూలై 12వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్‌లు



శ్రీకాకుళం న్యూకాలనీ: బడిఈడు పిల్లలను బడిలో చేర్పించేందుకు 'నేను బడికి పోతా' అనే సరికొత్త కార్యక్రమానికి పాఠశాల విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. 6 నుంచి 14 ఏళ్ల పిల్లలందరూ బడుల్లోనే ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు నిర్ణయించింది. విద్యాశాఖ, సమగ్రశిక్ష అధికారులు ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని పర్యవేక్షిస్తున్నారు.

జూలై 12 వరకు ప్రత్యేక డ్రైవ్

విద్యాశాఖ పరిధిలో ఉన్న సమగ్ర శిక్ష ద్వారా నేను బడికి పోతా కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి సమగ్రశిక్ష ఎస్‌పీడీ బి.శ్రీనివాసరావు ఇటీవల ఉత్తర్వులను జారీ చేశారు. ఇందులో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల సహకారంతో డోర్ టు డోర్ తిరుగుతూ ప్రత్యేక డ్రైవ్‌ను చేపడుతున్నారు. చదువుకు దూరంగా ఉన్నవారు చదువుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలతోపాటు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, పథకాలను వివరిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యాభివృద్ధి కార్యక్రమాలు, డిజిటల్ విద్య, సాంకేతికత గురించి పిల్లలు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పాఠశాలకు పంపేలా చర్యలు తీసుకోనున్నారు. జూలై 12వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్‌ను జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. ఇందులో జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అధికారులతో ప్రత్యేక కమిటీలను నియమించనున్నారు. ఆయా కమిటీ సభ్యులు వారికి అప్పగించిన పనులను పూర్తిస్థాయిలో నిర్వర్తించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జూలై 13న పిల్లలందరూ పాఠశాలల్లోనే ఉన్నారని అధికారంగా ప్రకటించాల్సి ఉంటుంది. అదే రోజు పేరెంట్స్ కమిటీలు కూడా తమ పాఠశాలల పరిధిలోని పిల్లలందరూ బడుల్లో ఉన్నట్లుగా ప్రకటించనున్నారు.

జిల్లా కమిటీలో ఉండేది వీరే..

జిల్లా విద్యాశాఖ అధికారి చైర్మన్‌గా, సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు కో–ఆర్డినేటర్(ఏపీసీ) మెంబర్ కన్వీనర్, డీపీఓ, కార్మిక శాఖ డీసీ, ఐటీడీఏ పీఓ, ఐసీడీఎస్ పీఓ, లేబర్, సోషల్, బీసీ, మైనార్టీ వెల్ఫేర్ డీడీలు, ఎన్‌సీఎల్‌పీ డీడీ, మెప్మా పీడీ, డీవైఈఓ, ఉర్దూ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సభ్యులుగా ఉన్నారు.

మండల కమిటీల్లో..

మండల విద్యాశాఖ అధికారి మెంబర్ కన్వీనర్, ఎంపీడీఓ చైర్మన్‌గా, తహసీల్దార్, ఐసీడీఎస్ సీడీపీఓ, సాంఘిక, గిరిజన సంక్షేమశాఖ అధికారులు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం, ఉర్దూ హెడ్మాస్టర్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్, డీఎల్‌ఎంటీలు సభ్యులుగా వ్యవహరిస్తున్నారు.

గ్రామ కమిటీల్లో..

పేరెంట్ కమిటీ చైర్మన్‌గా ఉన్న వ్యక్తి గ్రామ కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. పాఠశాల హెచ్‌ఎం మెంబర్ కన్వీనర్, పంచాయతీ కార్యదర్శి సీఆర్పీ, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, గ్రామ వలంటీరు, అంగన్‌వాడీ ఉద్యోగి సభ్యులుగా ఉన్నారు.

బడిఈడు పిల్లలు బడుల్లో ఉండాలి



నేను బడికి పోతా కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వివిధ స్థాయిల్లో ఉన్న కమిటీల్లో ఉండేవారు బాధ్యత తీసుకోవాలి. షెడ్యూల్ ప్రకారం కార్యక్రమం నిర్వహించాలి. – డాక్టర్ రోణంకి జయప్రకాష్, సమగ్రశిక్ష ఏపీసీ, శ్రీకాకుళం

కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి..



నేను బడికి పోతా కొత్త కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అందరూ కృషిచేయాలి. ఇందుకోసం కమిటీలను ఏర్పాటుచేస్తాం. కమిటీల్లో ఉండే సభ్యులు నిర్దేశించిన గడువులో ఇంటింటికీ తిరిగి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలి. ఈ డ్రైవ్‌లో బడిఈడు పిల్లలను గుర్తించి బడుల్లో చేర్పేందుకు కృషి చేయాలి. – కె.వెంకటేశ్వరరావు, డీఈఓ, శ్రీకాకుళం



'నేను బడికి పోతా' కార్యక్రమం పోస్టర్

గంగపుత్రుల గుండె చప్పుడే తండేల్



కార్తీక్ తీడ

చిట్ చాట్

- చిత్ర కథ కోసం ఎంతో పరితపించాను
- పత్రికల్లో వచ్చిన కథనాలే ఈ కథకు స్ఫూర్తి
- 'సాక్షి'తో 'తండేల్' కథారచయిత కార్తీక్ తీడ

శ్రీకాకుళం కల్చరల్: గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న 'తండేల్' సినిమా కథను శ్రీకాకుళానికి చెందిన కార్తీక్ తీడ సమకూర్చారు. శ్రీకాకుళానికి షూటింగ్ కోసం వచ్చిన కార్తీక్ 'సాక్షి'తో తన అనుభవాలను పంచుకున్నారు. తాను పుట్టింది, చదివింది అంతా శ్రీకాకుళంలోనేనని, సినిమాలపై ఉన్న ఆసక్తితో 2012లో ఇండస్ట్రీకి వెళ్లానని తెలిపారు. చాలా మంది దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశానని, దర్శకుడు కృష్ణవంశీ వద్ద కూడా పనిచేశానని, ఆయనే తనకు గురువుతో సమానమని చెప్పారు. 2018లో పత్రికల్లో వచ్చిన వార్తలే 'తండేల్' కథను రాయడానికి స్ఫూర్తి కలిగించాయని వివరించారు. శ్రీకాకుళం మత్స్యకారులు కొంత మందిని పాకిస్తాన్ జైలులో బంధించిన విషయాన్ని పత్రికల్లో చదివానని, ఎచ్చెర్ల మండలం డి.మత్స్యలేశం గ్రామానికి చెందిన మత్స్యకారులు రాసిన లేఖలు, పాకిస్తాన్ జైలు నుంచి వారు రాసిన లేఖలు, రాజకీయ నాయకులతో సంప్రదింపులు వంటివన్నీ చూశానని గుర్తు చేసుకున్నారు. ఆ గ్రామం వెళ్లి అక్కడి మత్స్యకారులతో మాట్లాడానని, 2019లో వారు విడుదలై వచ్చాక కూడా మాట్లాడానని తెలిపారు. 2020లోనూ కొందరితో మాట్లాడానని, ఈ సంఘటనలన్నీ క్రోడీకరించి మంచి లవ్ స్టోరీగా మలిచి గీతాఆర్ట్స్ అధినేత అల్లు అరవింద్‌తో పాటు బన్నీవాస్‌లకు చెప్పానని తెలిపారు. కథ నచ్చి వెంటనే అడ్వాన్స్ కూడా ఇచ్చారని, సినిమాకు దర్శకుడిగా చందూ మొండేటిని ఎంపిక చేశారని చెప్పారు. హీరోహీరోయిన్లుగా నాగ చైతన్య, సాయిపల్లవిని ఎంపిక చేశారని, మూడేళ్ల కిందటే ఈ కథను పూర్తి చేశానని వివరించారు. ఈ సినిమాతో తన కెరీర్ మరింత ఉన్నత స్థాయికి వెళ్తుందని నమ్మకంగా ఉన్నానన్నారు.

తామరాపల్లి విద్యార్థికి ఏపీపీజీఈ సెట్‌లో మొదటి ర్యాంకు



నరసన్నపేట: తామరాపల్లికి చెందిన దార్లపూడి పవన్ కుమార్ ఏపీపీజీఈ సెట్‌లో (పోస్టుగ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్) ఫస్ట్ ర్యాంకును సాధించారు. శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం (తిరుపతి) ఇటీవల ఏపీపీజీఈసెట్ పరీక్షలు నిర్వహించింది. పవన్ ఈ ర్యాంకు సాధించడంపై తల్లిదండ్రులు ప్రభుశర్మ, రత్నంలు ఆనందం వ్యక్తం చేశారు.

తీర్థయాత్రలకు ప్రత్యేక రైళ్లు

- అందుబాటులో స్పెషల్ ప్యాకేజీలు
- ఐఆర్‌సీటీసీ ఆర్‌ఎం సార్వర్కర్



బ్రోచర్ విడుదల చేస్తున్న రైల్వే అధికారులు

ఆమదాలవలస: ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలతో పాటు పర్యాటక కేంద్రాలను సందర్శించే భక్తుల సౌకర్యార్థం ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ సంస్థ ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు ఐఆర్‌సీటీసీ రీజనల్ మేనేజర్ క్రాంతి పి.సార్వర్కర్ తెలిపారు. ఆమె బుధవారం శ్రీకాకుళం రోడ్డు రైల్వే స్టేషన్(ఆమదాలవలస) లోని వీఐపీ లాంజ్‌లో విలేకరులతో మాట్లాడారు. దేశ విదేశాల్లో పర్యటించనున్న ప్రయాణికులకు ఐఆర్‌సీటీసీ సంస్థ ద్వారా కల్పిస్తున్న వివిధ రకాల టూర్ ప్యాకేజీలను వివరించారు.

ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు దైవ క్షేత్ర సందర్శనకు భారత్ గౌరవ యాత్ర పేరుతో ప్రత్యేక రైలును నడుపుతున్నట్లు తెలిపారు. ఈ రైలు సికింద్రాబాద్‌లో బయల్దేరి పూరి, గయా, వారణాసి, అయోధ్య, ప్రయోగ రాజ్ వంటి పుణ్య క్షేత్రాలకు తీసుకెళ్తుందని వివరించారు. తొమ్మిది రాత్రులు, పది పగళ్ల ప్రయాణమని పేర్కొన్నారు. ఎకానమీలో పెద్దలకు ఒక్కొక్కరికి రూ. 16,525, పిల్లలకు రూ.15410, స్టాండర్డ్ పెద్దలకు రూ. 25980, చిన్నారులకు రూ.24670, కంఫర్ట్ పెద్దలకు రూ.33,955, చిన్నారులకు రూ. 32,380 వసూలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ రైళ్లలో ప్రయాణం చేసే భక్తులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి అల్పాహారంతో పాటు వసతి, దైవ క్షేత్రాల సందర్శనలకు ప్రత్యేక గైడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ బండిలో స్లీపర్ క్లాస్, థర్డ్ ఏసీ, సెకండ్ క్లాస్ ఏసీ బోగీల ద్వారా 716 మంది ప్రయాణిస్తారని తెలి పారు. ఈ రైలు సికింద్రాబాద్‌లో బయల్దేరుతుందని కాజీపేట, ఖమ్మం, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, వైజాగ్, విజయనగరం వంటి రైల్వే స్టేషన్లలో బోర్డింగ్ సదుపాయం ఉందని తెలిపారు.

పర్యాటక ప్రియుల కోసం..

దేశవిదేశాల్లో ఉన్న పర్యాటక కేంద్రాలు సందర్శించడానికి వెళ్లే వారి కోసం ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో ఎయిర్ ప్యాకేజీలను కూడా రూపొందించామ ని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుమల తిరుపతి దర్శనానికి రూ.300 దర్శన టికెట్‌తో కూడిన రెండు రాత్రులు మూడు రోజుల ప్రత్యేక ప్యాకేజీ అందుబాటులో ఉందని ఆమె తెలిపారు. ప్రారంభ టికెట్ ధర రూ.17,730 మాత్రమేనని అన్నారు. ప్రయాణికులు ఆన్‌లైన్ ద్వారా రైల్వే రిజర్వేషన్ టికెట్ బుకింగ్ కౌంటర్లతో పాటు శ్రీకాకుళం రోడ్డు రైల్వే స్టేషన్‌లోని రెండో నంబర్ ప్లాట్ ఫామ్ పైన ఉన్న జన ఆహార్ స్టాల్ వద్ద ఐఆర్‌సీటీసీ ప్రతినిధిని కలిసి టికెట్లను బుక్ చేసు కోవచ్చని సూచించారు. ఎవరికి ఎలాంటి సమాచారం కావాల్సి ఉన్నా www.irctcoturism.comవెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చునని తెలిపారు. ఈ సమావేశంలో ఐఆర్‌సీటీసీ ఎగ్జిక్యూటివ్ సంఘమిత్ర రావు, రైల్వే స్టేషన్ మాస్టర్ మొదలవలస రవి, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ గణేష్ తాప పాల్గొన్నారు.

రైలు బయల్దేరే తేదీలు

ఈ రైలు జూలై 9వ తేదీన సికింద్రాబాద్‌లో బయల్దేరి పుణ్యక్షేత్రాల సందర్శన ముగించుకొని 17వ తేదీకి తిరిగి చేరుతుందని తెలిపారు. అలాగే మరో రైలు మానస్కండ్ యాత్ర భారత్ గౌరవ్ టూరిస్ట్ ట్రైన్ పేరిట జూలై 26వ తేదీన విశాఖపట్నంలో బయల్దేరి తిరిగి పుణ్యక్షేత్రాలను సందర్శించుకుని ఆగస్టు 5వ తేదీకి విశాఖపట్నం చేరుతుందని తెలిపారు. పది రాత్రులు, 11 రోజులు ఈ రైలు ప్రయాణం ఉంటుందని అన్నారు. స్టాండర్డ్‌లో పెద్దలకు రూ.28,020, పిల్లలకు రూ.28,020, డీలక్స్‌లో పెద్దలకు రూ.35340, పిల్లలకు రూ. 35,140 చార్జీలు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ రైలు బీమటాల్, నైనిటాల్, కైంచి ధామ్, కాసర్ దేవి, కాటన్ మాల్ సన్ టెంపుల్ జాగేశ్వర్ దాం, గోలు దేవత, ఆల్మోరా, బైజనాథ్, బాగేశ్వర్, కౌసాని, రాణిఖేట్ తదితర ప్రదేశాల్లోని పుణ్యక్షేత్రాలు చూపిస్తుందన్నారు.



మరిన్ని వివరాలకు మొబైల్ నెంబర్లు
8287932318 , 9281495847
సంప్రదించవచ్చు.

సీనియర్ అసిస్టెంట్ అక్రమాలపై విచారణ



దినసరి వేతనదారులతో మాట్లాడుతున్న విచారణాధికారి, డీసీ సుజాత, పక్కనే ఈఓ చంద్రశేఖర్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన కృష్ణమాచార్యులు.. ఆలయంలో దినసరి వేతనదారులుగా పనిచేస్తున్న సిబ్బంది నుంచి రూ.లక్షల్లో డబ్బులు వసూలు చేశారని వచ్చిన ఆరోపణలపై బుధవారం విశాఖపట్నం డిప్యూటీ కమిషనర్ సుజాత ఆధ్వర్యంలో విచారణ జరిగింది. విశ్వసనీయ సమాచారం మేరకు స్థానిక జిల్లా దేవదాయ శాఖాధికారి ప్రసాద్‌పట్నాయక్, డీసీ కార్యాలయ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్‌ల సమక్షంలో ఆలయ ఈఓ ఎస్.చంద్రశేఖర్ ఇక్కడి పరిస్థితిని ముందుగా వివరించారు. అనంతరం దినసరి వేతనదారులుగా పనిచేస్తున్న సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. దీనిపై ఆమె మాట్లాడుతూ డబ్బులు ఎవరికి ఇచ్చారు.? ఎందుకని ఇచ్చారు..? ఆధారాల వివరాలను తెలియజేయండంటూ...? పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈ ఉద్యోగాల నియామకాల విషయంలో డబ్బులు వసూలు జరిగిన తీరు, అలాగే రాష్ట్ర కమిషనర్ కార్యాలయంలో ఇందుకోసం చేసిన ఖర్చుల వివరాలను కూడా కొందరు దినసరి వేతనదారులు డీసీ సుజాత ముందు వివరించారు. అనంతరం ఒక్కొక్కరి నుంచి ఫిర్యాదులు, ఇతర వివరాలన్నీ స్టేట్‌మెంట్‌గా రికార్డు చేసుకుని విచారణను ముగించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కృష్ణమాచార్యులపై వచ్చిన అక్రమ ఆరోపణలపై కమిషనర్ సత్యనారాయణ ఇచ్చిన ఆదేశాల మేరకు ఆయన్ను వెంటనే మాతృఆలయానికి సరెండర్ చేశామన్నారు. అలాగే తాజాగా బాధితుల నుంచి సేకరించిన వివరాలతో ప్రత్యేక నివేదికను తయారు చేశామని, త్వరలోనే రాష్ట్ర కమిషనర్‌కు అందజేస్తామని డీసీ సుజాత అన్నారు. ఈ విచారణ ప్రక్రియలో ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ బాబు తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న ఐటీఐ కౌన్సెలింగ్



కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలోని మూడు ప్రభుత్వ, 20 ప్రైవేట్ ఐటీఐ ప్రవేశాలకు నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో కొనసాగుతోంది. రెండో రోజు బుధవారం 414–877 మధ్య ర్యాంకు విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించగా, 446 మందికిగాను 201 మంది హాజరయ్యారు. 112 మందికి సీట్లు కేటాయించారు. గత రెండు రోజులు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో మొత్తం 265 మందికి ప్రవేశాలు కల్పించారు. 878 నుంచి 1399 ర్యాంకు మధ్య విద్యార్థులకు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. రెండు పూటలు కౌన్సెలింగ్ సాగుతుంది. ప్రత్యేక రిజర్వేషన్లు, ప్రాధాన్యత తక్కువగా ఇచ్చే ట్రేడుల్లో తప్ప ప్రభుత్వ ఐటీఐల్లో సీట్లు నిండిపోయాయి. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ 23 ఐటీఐల్లో 3608 సీట్లు ఉన్నాయి.

'కాలువ మరమ్మతులు పూర్తి చేయాలి'



టెక్కలిపట్నం వద్ద వంశధార కాలువను పరిశీలిస్తున్న మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే శిరీష

పలాస: వంశధార ఎడమ కాలువ మరమ్మతు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. పలాస మండలంలోని టెక్కలిపట్నం వద్ద గల వంశధార ఎడమ కాలువను, ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌ను బుధవారం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆఫ్‌షోర్ పనులు కూడా త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. జిల్లాలో రైతులకు కావాల్సిన విత్తనాలను, ఎరువులను అందజేస్తున్నామని చెప్పారు. మత్స్యకారులకు శీతల గిడ్డంగులను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. రైతులు సకాలంలో ప్రభుత్వం ఇస్తున్న అవకాశాలను ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వంశధార అధికారులతో పాటు వ్యవసాయ శాఖ అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీముఖలింగంలో పండిత సదస్యం



శ్రీముఖలింగంలో పండిత సదస్యం నిర్వహిస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో పాంచరాత్రి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా బుధవారం అంకురార్పణ, హోమం, పండిత సదస్యం ఘనంగా నిర్వహించారు. గణపతి పూజతో ప్రారంభించి స్వామికి ప్రత్యేక పూజలు, ఏకవార అభిషేకాలు నిర్వహించారు. దీనికి ముందు స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు

రూ.3.23 లక్షలకు శ్రీముఖలింగం మార్కెట్ వేలంపాట ఖరారు



వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

జలుమూరు: శ్రీముఖలింగం మార్కెట్ ఆశీలు వేలంపాట రూ.3,23,000 లకు గ్రామానికి చెందిన అప్పన్న బారికో దక్కించుకున్నట్లు డివిజనల్ పంచాయతీ అధికారి గోపి బాల బుధవారం తెలిపారు. ఏడాదికి ఒక్క సారి నిర్వహించే వేలం పాట గ్రామ సర్పంచ్ టి.సతీష్‌కుమార్, ఎంపీటీసీ కె.హరి ప్రసాద్, గ్రామ పెద్దలు బీవీ రమణ తదితరుల సమక్షంలో నిర్వహించినట్లు ఈఓపీఆర్డీ ఉమా మహేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జమున సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

వడదెబ్బకు వృద్ధుడు మృతి



వెంకటరావు(ఫైల్)

నరసన్నపేట: స్థానిక వీర న్నాయుడు కాలనీకి చెందిన బాషా వెంకటరావు (77) వడదెబ్బకు మృతి చెందాడు. మంగళవారం మధ్యాహ్నం వీరన్నాయుడు కాలనీ నుంచి బజారు వీధికి పనిపై వెళ్లిన వెంకటరావు సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో భార్య లక్ష్మి ఆందోళనకు గురయ్యారు. స్థానికుల సహకారంతో బజారు వీధిలో గాలించగా ఒక చోట గోడకు ఆనుకొని చనిపోయి కనిపించారని కుటుంబ సభ్యులు తెలిపారు. నిరుపేద కుటుంబం కావడంతో కుల సంఘ ప్రతినిధులు విరాళాలు సేకరించి బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు.

ఆంధ్రప్రదేశ్ కాళింగ సంక్షేమ సేవా సంఘం మీడియా కార్యదర్శిగా చౌదరి



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఆంధ్రప్రదేశ్ కాళింగ సంక్షేమ సేవా సంఘం మీడియా కార్యదర్శిగా చౌదరి లక్ష్మణ రావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ కాళింగ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు సీపాన వెంకట రమణ తనను నియమిస్తూ నియామక పత్రం, గుర్తింపు కార్డు అందించారన్నారు. తాను శ్రీకాకుళం జిల్లా జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షునిగా, శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ మీడియా సెల్ కన్వీనర్‌గా పనిచేశానని, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ బీసీ న్యాయవాదుల అసోసియేషన్, శ్రీకాకుళం జర్నలిస్ట్ ఫోరమ్, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శిగా, ఉత్తరాంధ్ర జర్నలిస్ట్ ఫ్రంట్ అధ్యక్షునిగా, ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ, బీ సీ, మైనారిటీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్‌గా, జిల్లా ఉపాధ్యక్షునిగా పనిచేస్తున్నానని తెలిపారు.

'రాహుల్ నాయకత్వం దేశానికి అవసరం'



పండ్లు కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: స్వర్గీయ రాజీవ్ గాంధీ తనయుడు, యువనేత రాహుల్‌గాంధీ నాయకత్వం దేశానికి ఎంతో అవసరమని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి అన్నారు. శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో సాధారణంగా కేక్‌ను కత్తిరించే కార్యక్రమానికి భిన్నంగా పండ్లను కట్ చేసి కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నాయి. ఈ సందర్భంగా కృపారాణి మాట్లాడుతూ ప్రధాని మోదీ పాలనలో పేదలు మరింత పేదలుగా మిగిలిపోతున్నారని, కేవలం కార్పొరేట్ సంస్థలకే కొమ్ముకాస్తున్నారని దుయ్యబట్టారు. పేదలకు మళ్లీ సంక్షేమ పథకాలు అందాలంటే అది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ కిల్లి రామ్మోహనరావు, అంబటి కృష్ణారావు, డి.గోవింద మల్లిబాబు, కేవీఎల్ఎస్ ఈశ్వరి, రెల్ల సురేష్, జీవీ నాయుడు, దీర్ఘాసి వెంకట్రావు, ఎం.అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

ముప్పై ఏళ్లకు ముచ్చటైన పంట

- ఆయిల్‌పామ్‌తో అధిక ఆదాయం
- ఎకరాకు రూ. లక్ష వరకు ఆదాయం
- జిల్లా వ్యాప్తంగా 2 వేల హెక్టార్లలో సాగు
- ఏటా ఒక్కో మొక్కకు 12 గెలల ఫలసాయం

బూర్జ: ఆయిల్ పామ్ సాగు రైతుల ఆదాయాన్ని పెంచుతోంది. ఆయిల్ పామ్ అత్యధిక నూనె దిగుబడిని ఇచ్చే పంటల్లో ఒకటి. హెక్టారుకు 20 టన్నుల పళ్ల గెల దిగుబడినిస్తుంది. అలాంటి ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వాలు కూడా ప్రత్యేక రాయితీలు ఇస్తున్నాయి. దీంతో రైతులు ఈ తరహా పంటల సాగుకు ఆసక్తి కనబరుస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 2000 హెక్టార్లలో ఆయిల్‌పామ్‌ను సాగు చేస్తున్నారు. పామాయిల్ పంటల్లో అంతర పంటలు వేసి వాటిలోనూ లాభాలను సంపాదించుకోవచ్చు.

ఇవీ ప్రయోజనాలు..

- ఏడాది పొడవునా నెలవారీ ఆదాయం, మార్కెట్ ధరకు హామీ ఉంటుంది.
- దొంగతనం భయం ఉండదు.
- ఆయిల్ పామ్ పంటలో తెగుళ్లు, వ్యాధులు చాలా తక్కువ.
- మొదటి మూడేళ్లలో ఏకవార్షిక పంటలైన కూరగాయలు, పూలు, అరటి, పసుపు, అల్లం, పైనాపిల్ వంటివి అంతర పంటలుగా వేసుకోవచ్చు. ఆ తర్వాత నీడను ఇష్ట పడే పంటలు (కోకో) అంతర పంటగా సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందవచ్చు.
- ఆయిల్ పామ్ 4–6 ఏళ్ల గల తోట నుంచి ఎకరానికి 8–10 టన్నులు దిగుబడి వస్తుంది.
- 30 ఏళ్ల పాటు ఫలసాయం వస్తుంది.

రాయితీ ఇలా..

- ఆయిల్ పామ్ సాగులో రెండు రకాల మొక్కలను సాగు చేసేందుకు ఉపయోగిస్తారు.
- స్వదేశీ రకం ఒక్కో మొక్కకు రూ. 133లు, దిగుమతి రకం మొక్కకు రూ. 193ల రాయితీ ప్రభుత్వం అందిస్తుంది. ఒక్క ఎకరాకు 60 మొక్కలు చొప్పున నాటాలి. ఒక్క ఎకరాకి ఇండిగోనియస్ రకానికి రూ. 8000 సబ్సిడీ, ఎగుమతి రకానికి రూ.11,600 చొప్పున ప్రభుత్వం అందజేస్తుంది.
- ఆయిల్ పామ్ మొక్క కొనుగోలుకి ప్రభుత్వం స్వదేశీ రకానికి హెక్టార్‌కి రూ.20,000 దిగుమతి రకానికి రూ.28,400 రాయితీని కల్పిస్తుంది.
- మొదటి నాలుగేళ్లకి ఖర్చుల కోసం ఏడాదికి రూ. 5250 చొప్పున హెక్టారుకి రూ. 21,000, అంతర పంటలు పండించేందుకు మొదటి నాలుగేళ్లకు హెక్టారుకు రూ.21,000 రాయితీ కల్పిస్తుంది.
- ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తూ బిందు సేద్యం పరికరాలకు కూడా చిన్న, సన్నకారు రైతులకు అందజేస్తుంది. జాబ్ కార్డు ఉన్న చిన్న, సన్నకారు వ్యవసాయ రైతులకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పిస్తుంది.



బూర్జ గ్రామంలో ఆయిల్ పామ్ తోటలు



మామిడివలసలో ఆయిల్ పామ్ మొక్కలు

రైతుల్లో ఆసక్తి

ప్రస్తుతం ఇతర పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం. ఆయిల్ పామ్ పంటలకు గిట్టుబాటు ధరతో పాటు ఉద్యానశాఖ ప్రోత్సాహకాలు లాభదాయకంగా ఉండడంతో మన జిల్లాలో రైతులు ఆయిల్ పామ్ సాగుకు మొగ్గు చూపుతున్నారు. ప్రధానంగా గార, రణస్థలం, లావేరు, జి.సిగడాం, పొందూరు, ఎచ్చెర్ల, బూర్జ, ఆమదాలవలస, నరసన్నపేట, పోలాకి, శ్రీకాకుళం మండలాలతో పాటు సుమారు 27 మండలాల్లో పంటకు అనుకూలంగా ఉంటుందని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇదివరకు జిల్లాలో రెండు ఆయిల్ పామ్ కంపెనీలు (పతంజలి ప్రైవేట్ ఫుడ్ కంపెనీ, శ్రీశ్రీనివాస ఆయిల్ మిల్) 20 మండలాల్లో మొక్కలు సరఫరా చేశాయి. ఇప్పుడు జిల్లాలో మరో ఆరు మండలాలను ఆయిల్ పామ్ సాగు మండలాలుగా గుర్తించారు. ప్రస్తుతం ఒక ఆయిల్ పామ్ కంపెనీ ఎం/ఎస్ శాంతి ఆయిల్ పామ్ ఇండస్ట్రీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ అదనంగా జిల్లాలో ఆయిల్ పామ్ మొక్కలు సరఫరా చేసేందుకు కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

చక్కటి ఆదాయం



ఆయిల్ పామ్ పంటల వల్ల రైతులకు మంచి గిట్టుబాటు ధరతోపాటు మంచి ఆదాయం చేకూరుతుంది. ఇది 30 ఏళ్ల పంట. సన్న చిన్న కారు జాబ్ కార్డు ఉన్న వ్యవసాయ రైతులకు ఉపాధి హామీ పనుల్లో భాగంగా పనులు కల్పిస్తుంది. టన్ను రూ. 13 వేలు వరకు అమ్ముడుపోతుంటుంది. ఏడాదికి ఒక్క ఎకరా 8–10 టన్నులు వరకు వస్తుంది. అంతర పంటలు వేసుకోవచ్చు. పెట్టుబడి తక్కువ, ఆదాయం ఎక్కువ ఉంటుంది. రైతులు ఆయిల్ పామ్ పంటలపై ఆసక్తి కనబరచాలి. మొక్కలను ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తుంది. పంట వేసిన నాలుగేళ్ల వరకు ఖర్చులు, పెట్టుబడి ప్రభుత్వమే భరిస్తుంది. అంతర పంటలకి కూడా పెట్టుబడి సహాయం చేస్తుంది.

– బి.అవంతి కుమారి, ఉద్యాన అధికారి, బూర్జ మండలం

రెండువేల హెక్టార్లలో..



జిల్లాలో రెండు వేల హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారు. ఈ పంటలకు నీరు, దారి ముఖ్యం. ప్రభుత్వం ఉచితంగా మొక్కలు సరఫరా చేస్తుంది. ఎరువులు, అంతర పంటలకు నాలుగేళ్ల వరకు ప్రభుత్వమే సహాయం చేస్తుంది. చీడపీడలు, దొంగల భయం ఉండదు. ఖర్చు తక్కువ, ఆదాయం ఎక్కువ. పంటలు వేసిన 8–10 ఏళ్లకు 140 నుంచి 150 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. టన్ను ధర రూ. 13000 వరకు పలుకుతుంది.

– రత్నాల వరప్రసాద్, జిల్లా ఉద్యాన అధికారి, శ్రీకాకుళం.

రోడ్డు ప్రమాదంలో యువకుడు వ్యక్తి మృతి

బూర్జ: మధ్యప్రదేశ్ రాష్ట్రం నీమశ్చ గ్రామానికి చెందిన సోహన్ గౌడ్ (32) రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో వైద్యం పొందుతూ బుధవారం సాయంత్రం మృతిచెందాడు. మండలంలో గల పెద్దపేట పంచాయతీ మదనాపురం గ్రామ జంక్షన్ సమీపంలో మధ్యాహ్నం శ్రీకాకుళం–పాలకొండ ప్రధాన రహదారిపై ప్లాస్టిక్ డబ్బాలు అమ్ముకోవడానికి బైక్‌పై దిగుతుండగా ఆమదాలవలస నుంచి పాలకొండ వైపు వెళ్తున్న ఐచర్ వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో యువకుడికి బలమైన గాయాలు కావడంతో అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. స్థానికులు 108కు సమాచారం అందించగా సిబ్బంది వచ్చి క్షతగాత్రుడిని రాగోలు జెమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ యువకుడు చనిపోయాడు. అవుట్ పోస్టు సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు స్థానిక ఎస్‌ఐ జీవీ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు ప్లాస్టిక్ డబ్బాలు అమ్ముకుంటూ జీవనం సాగించేవాడని స్థానికులు తెలియజేశారు.

నెహ్రూ యువకేంద్రంలో జాబ్‌మేళా రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ గ్యారేజ్‌కు ఆనుకుని వెనుకుని ఉన్న నెహ్రూ యువకేంద్రంలో ఈనెల 21వ తేదీన జాబ్‌మేళా జరగనుందని జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ తెలిపారు. శ్రీరామ్ ఫైనాన్స్, స్పందన స్ఫూర్తి ఫైనాన్స్ లిమిటెడ్, 2050 హెల్త్ కేర్ సంస్థల్లో ఉద్యోగాల భర్తీ కోసం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. టెన్త్ పాస్/ఫెయిల్, ఇంటర్ పాస్/ఫెయిల్, డిగ్రీ, జీడీఏ, ఏఎన్ఎం, జీఎన్ఎం, ఎంహెచ్‌డబ్ల్యూ కోర్సుల్లో ఉత్తీర్ణులై.. 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. ఆకర్షణీయమైన జీతంతోపాటు ఇతర అలవెన్సులు ఉంటాయన్నారు. శుక్రవారం ఉదయం 10కు తమ బయోడేటా, సర్టిఫికెట్ల జిరాక్స్‌లు, ఆధార్‌తో హాజరుకావాలన్నారు.

'తవ్విన చెరువు గట్టు యథావిధిగా నిర్మించాలి'

నరసన్నపేట: చెరువు గట్టుపై అక్రమంగా తవ్వి మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తప్పవని శ్రీకాకుళం ఆర్డీఓ సీహెచ్ రంగయ్య అన్నారు. 'శ్రుతి మించుతున్న మట్టిమాఫియా ఆగడాలు' అనే శీర్షికన చెరువు గట్లు, చెరువుల్లో మట్టి తవ్వకాలపై సాక్షిలో కథనం ఈ నెల 17న ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఆర్డీఓ బుధవారం అంపలాం వద్ద చిట్టోడు చెరువును స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువు గట్టును యథావిధిగా వేయించాలని నరసన్నపేట తహసీల్దార్ కనకారావుకు ఆదేశించారు. గతంలో చెరువు గట్టు ఎలా ఉండేదో అలానే మళ్లీ గట్టు నిర్మాణం కావాలని ఆదేశించారు. ఎవరైతే మట్టిని తరలించారో వారితోనే ఈ పని చేయించాలని లేకపోతే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. చెరువు గట్టు, చెరువు విస్తీర్ణం ఎంత ఉందనేది కొలతలు వేసి మార్కింగ్ పెట్టాలని సూచించారు. ఆర్డీఓ వెంట స్థానిక సర్వేయర్ అప్పలస్వామి, ఆర్ఐ లోకేష్, వీఆర్వోలు అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.



చెరువు గట్టును పరిశీలించి అధికారులకు సూచనలు చేస్తున్న ఆర్డీఓ రంగయ్య

ఈదురుగాలుల బీభత్సం



మెయిన్‌రోడ్‌లో నేలకొరిగిన భారీవృక్షాలు



లాలాపేటలో ఆటోపై విరిగిపడిన చెట్టు

ఇచ్ఛాపురం: పట్టణంలో ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన కుండపోత వాన కురిసింది. ఈ గాలుల ధాటికి లాలాపేట, బంగ్లారోడ్, గాంధీపార్కులైన్, మున్సిపల్ కార్యాలయం మెయిన్‌రోడ్‌లో గల పెద్ద వృక్షాలు నేలకొరిగాయి. ఈ క్రమంలో లాలాపేటకు చెందిన పైల మోహనరావుకు చెందిన ఆటో పూర్తిగా ధ్వంసమైంది. పట్టణంలో 8 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఈదురు గాలుల బీభత్సానికి ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. విద్యుత్ అధికారులు, సిబ్బంది నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేశారు.

'అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు'



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న డీపీఓ వెంకటేశ్వరరావు

ఎల్ఎన్ పేట: జిల్లాలోని అన్ని గ్రామాల్లోనూ పారిశుద్ధ్య పనులు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) వి.వెంకటేశ్వరావు అన్నారు. మండల కేంద్రంలో పారిశుద్ధ్య పనులను బుధవారం ఆయన పరిశీలించారు. వారం రోజుల పాటు అన్ని గ్రామాల్లోనూ పూర్తి స్థాయిలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని గ్రామ సచివాలయ ఉద్యోగులకు, పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభం అవుతున్నందున డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పర్చాలని సూచించారు. డ్రైనేజీల్లో పూర్తి స్థాయిలో పూడికలు తొలగించి చెత్తను చెత్త సేకరణ కేంద్రాలకు తరలించాలన్నారు. గ్రామస్తులతో సమావేశాలు ఏర్పాటు చేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటంపై అవగాహన కలిగించాలని తెలిపారు. మండల కేంద్రాల్లోను, ప్రధాన కూడళ్ల వద్ద రోడ్ల పక్కనున్న డ్రైనేజీల ఆక్రమణలకు గురయ్యాయని అన్నారు. పోలీసుల సహకారంతో ఆక్రమణలు తొలగించాలన్నారు. నిర్లక్ష్యంగా పనిచేస్తే చర్యలు తప్పవన్నారు. ఆయనతో పాటు ఎంపీడీఓ గిరిబాల, ఈఓపీఆర్డీ ఐ పద్మజ, పంచాయతీ కార్యదర్శులు జయమోహన్ పాడి, జి.తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

బ్రెయిన్ ట్యూమర్ బాధితురాలికి ఆర్థిక సాయం



జానకమ్మకు ఆర్థిక సాయం చేస్తున్న గల్ఫ్ కార్మికులు చింత పద్మారావు, కుటుంబ సభ్యులు

వజ్రపుకొత్తూరు: మండలంలోని ఉద్దానం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన బ్రెయిన్ ట్యూమర్ బాధితురాలు చిట్టిత జానకమ్మకు అదే గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మికులు ఆర్థిక సాయం చేసి ఆదుకున్నారు. వివిధ దేశాల్లో వలస కార్మికులుగా పని చేస్తున్న 56 మంది ముందుకొచ్చి బుధవారం గ్రామంలో గల్ఫ్ కార్మికుడు చింత పద్మారావు కుటుంబ సభ్యుల చేతుల మీదుగా రూ.87,551లను జానకమ్మకు అందించారు. ఇటీవల జానకమ్మ భర్త చిట్టి రాజారావు చనిపోవడంతో ఆమె ఒంటరిగా జీవిస్తోంది. పనికి పోతే తప్ప ఆమెకు పూట గడవదు. ఇలాంటి దశలో గల్ఫ్ కార్మికులంతా ఏకమై సాయం చేసేందుకు ముందుకువచ్చారు. వైద్యం, ఇతర అవసరాల కోసం ఆమెకు ఆర్థిక సాయం అందజేశారు. సేవా సంస్థలు, దాతలు ముందుకు వచ్చి ఆమెకు సాయం చేయాలని కోరారు. గ్రామంలో ఎవరికి కష్టమొచ్చినా ఆదుకునే గల్ఫ్ కార్మికులు జానకమ్మనూ ఆదుకోవడంతో గ్రామస్తులు వారిని ప్రశంసించారు. కార్యక్రమంలో గల్ఫ్ కార్మికులు లింగూడు సోమేశ్వరరావు, సీహెచ్. బాలాజీ, ఎస్. పోతారావు, ఎస్. శ్రీనివాసరావు, సీహెచ్.లోకనాథం, డి. సునీల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కన్వీనర్‌గా భమిడిపాడి



భమిడిపాటి గౌరీశంకర్



ఉమాకవి

శ్రీకాకుళం కల్చరల్: 'జాతీయ తెలుగు యువ రచయితల సమ్మేళనం'కు శ్రీకాకుళం జిల్లా కన్వీనర్‌గా గాయత్రీ కాలేజి తెలుగు విభాగాధిపతి భమిడిపాడి గౌరీశంకర్, ప్రధాన కార్యదర్శిగా చైతన్య కిరణాలు, బాలకథానిలయం అధ్యక్షులు డాక్టర్ భోగెల ఉమాకవిలను ఎంపికచేసినట్లు వేదిక కన్వీనర్ డాక్టర్ జీవీ పూర్ణచంద్ ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 28, 29 తేదీల్లో విజయవాడ కేంద్రంగా కృష్ణా జిల్లా రచయితల సంఘం, ప్రపంచ తెలుగు రచయితల సంఘం సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సమ్మేళనానికి జిల్లాలోని వివిధ పాఠశాలలు, కళాశాలలు విశ్వవిద్యాలయాల విద్యార్థులు, 40 ఏళ్లలోపు రచయిత, రచయిత్రులు పాల్గొనవచ్చని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి రుసుం లేదని, ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తారని ఆయన తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9492858395 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పీఓడబ్ల్యూ పోస్టర్ ఆవిష్కరణ



మాకన్నపల్లిలో పీఓడబ్ల్యూ పోస్టర్ ఆవిష్కరణలో ఆ సంఘు జిల్లా కార్యవర్గం

కాశీబుగ్గ: ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) అర్ధ శతాబ్ది ముగింపు సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం పోస్టర్ ఆవిష్కరించారు. పలాస మండలం మాకన్నపల్లి గ్రామంలో బుధవారం పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. విశాఖ పట్నం పౌర గ్రంథాలయంలో జూన్ 22న జరిగే సదస్సును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బర్ల జానకి, హేమక్క, జానికమ్మ, సావిత్రమ్మ, రాజమ్మ, పుణ్యావతి, లక్ష్మమ్మ, తవిటమ్మ, మహాలక్ష్మి, దమయంతి పాల్గొన్నారు.

సచివాలయానికి తాళాలు



సచివాలయం సిబ్బంది కోసం ఎదురు చూస్తున్న అర్జీదారులు

సరుబుజ్జిలి: షళంత్రి గ్రామ సచివాలయం సిబ్బంది సక్రమంగా విధులకు హాజరు కాకపోవడంతో సర్పంచ్ బత్తిని వరలక్ష్మి భర్త గౌరినాయుడు బుధవారం సచివాలయానికి తాళాలు వేసి మండల పరిషత్ అధికారులకు అప్పగించారు. ఉదయం 10గంటల 30 నిమిషాలకు సర్పంచ్ భర్త కొంతమంది అర్జీదారులతో కలిసి సచివాలయానికి వచ్చారు. చాలాసేపు ఎదురుచూసినా సిబ్బంది హాజరుకాలేదు. కాసేపటికి వీఆర్ఏ వచ్చి తాళాలు తీశారు. అయినప్పటికీ సచివాలయం సిబ్బంది ఎవ్వరూ విధులకు హాజరు కాకపోవడంతో ఆగ్రహించిన సర్పంచ్ భర్త గౌరినాయుడు కార్యాలయానికి తాళాలు వేశారు. ఆలస్యంగా విధులకు వచ్చిన సచివాలయం సిబ్బంది.. తాళాలు వేసిన విషయం తెలుసుకొని మండలపరిషత్ కార్యాలయానికి పరుగులు తీశారు. ఎంపీడీఓ సూపరింటెండెంట్ బీవీ ప్రసాద్ భవిష్యత్‌లో మరోసారి జరగకూడదని హెచ్చరించి పంపించారు.

కోర్సుల్లో చేరేందుకు గడువు పెంపు

ఆమదాలవలస: మండలంలోని తొగరాం వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో చేరేందుకు గడువును ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఈ నెల 30 వరకు పెంచిందని ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పైడి వెంకటరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జూన్ 1 నుంచి 20వ తేదీ వరకు కోర్సుల్లో చేరేందుకు అవకాశం కల్పించినట్లు ఇదివరకు ప్రకటనలో పేర్కొన్నప్పటికీ విశ్వవిద్యాలయం గడువు పెంచినట్లు తెలిపారు. వ్యవసాయ పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 2002 ఆగస్టు 31 నుంచి 2009 ఆగస్టు 31 లోపు జన్మించిన వారై ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు పదోతరగతి ఉత్తీర్ణత ఉండాలన్నారు. విద్యార్థులు (www.angrau.ac.in) వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదో తరగతి సప్లిమెంటరీ విద్యార్థుల కోసం ఈ గడువు పెంచినట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9705209418 ను సంప్రదించాలని ప్రిన్సిపల్ వెంకటరావు కోరారు.

శాస్త్రోక్తంగా ఔపోసనా హోమాలు



ఔపోసనా హోమాలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని ఉమారుద్ర కోటేశ్వర స్వామి దేవాలయంలో జరుగుతున్న వార్షిక కల్యాణోత్సవాల సందర్భంగా బుధవారం ఔపోసనా హోమాలు జరిగాయి. ఆలయ అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మల ఆధ్వర్యంలో స్వామికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, ప్రదోష కాలంలో నందీశ్వరునికి క్షీరాభిషేకాలు, అమ్మవారికి హారతి అనంతరం సహస్ర పుష్ప అలంకరణ జరిగింది. కార్యక్రమంలో ప్రముఖ పండితులు ఆరవెల్లి హరగోపాల్ శర్మ, గన్నవరం కృష్ణారావు, రాజేశ్వరమ్మ దంపతులు, ఆలయ ఈఓ సర్వేశ్వరరావు, నాగేశ్వరరావు, లలితా మండలి సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దారి కాచిన మృత్యువు

- ఆగిన లారీని ఢీకొన్న మరో లారీ
- ఇద్దరు మృతి



లారీలో ఇరుక్కున్న మృతదేహాలు

టెక్కలి రూరల్: జాతీయ రహదారి పక్కన ఆపి ఉన్న లారీని మరో లారీ ఢీకొన్న ఘటనలో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. టెక్కలి మండలం విక్రాంపురం గ్రామం వద్ద బుధవారం వేకువజామున ఈ ప్రమా దం జరిగింది. ప్రమాదంలో ఢీకొన్న లారీలోని డ్రైవర్, క్లీనర్లు అక్కడికక్కడే మృతిచెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఒడిశా నుంచి కాకినాడ వైపు బియ్యం లోడు తీసుకు వెళ్తున్న లారీ టెక్కలి సమీపానికి వచ్చేసరికి ముందు వెళ్తు న్న లారీని దాటే ప్రయత్నంలో ఎడమ వైపు నుంచి అతివేగంగా వెళ్లడంతో రోడ్డు పక్కగా పార్క్ చేసి ఉన్న లారీని బలంగా ఢీకొట్టింది. దీంతో ఆ లారీ వెళ్లి దాని ముందు ఉన్న మరో లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో అతివేగంగా వచ్చి ఢీకొన్న లారీలోని డ్రైవర్ అసద్‌ఆలీ(42), క్లీనర్ నూరల్ ఇస్లాం(35)లు క్యాబిన్‌లో ఇరుక్కుని చనిపోయారు. వీరిద్దరూ అస్సాం రాష్ట్రానికి చెందిన వారు. అయితే ముందు ఉన్న లారీలో వారికి ఎలాంటి గాయాలు కాలేదు. విషయం తెలుసుకున్న హైవే సిబ్బంది, టెక్కలి ఎస్ఐ లక్ష్మితో పాటు ఏఎస్ఐ వెంకటరమణ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం స్థానికులను అడిగి వివరాలు నమోదు చేసుకున్నారు. అనంతరం లారీలో ఇరుక్కున్న మృతదేహాలను బయటకు తీసి టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. టెక్కలి ఎస్ఐ లక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. రహదారి పక్కగా వాహనాలు నిలపడం వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.